## తమిళనాడు ప్రభుత్వానికి చుక్కెదురు..



**అక్షరటుడే, తమిళనాడు:** మద్రాస్ హైకోర్టులో తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. తిరుప్పరం కుండ్రం దేవస్థానం దీపం వివాదంలో హిందూ సంస్థలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. తిరుప్పరం కుండ్రం దీపం కేసులో సింగిల్ బెంచ్ జడ్జి తీర్పును ధర్మాసనం సమర్థించింది. తిరుప్పరం కుండ్రం దేవస్థానం దీపం వెలిగించవచ్చన్ని పేర్కొంది. స్టాలిన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీపం వివాదంపై రాజకీయాలు తగదని సూచించింది.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ



**అక్షరటుడే, ఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. సోమవారం సాయంత్రం హాస్పిటల్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కాగా.. సోనియా గాంధీ కొంతకాలంగా దీర్ఘకాలిక దగ్గు సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం.


6-1-2026 (Tuesday) MAIN EDITION


## టీవీకే చీఫ్ విజయ్‌కి సమన్లు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ తమిళ నటుడు విజయ్‌కి సీబీఐ సమన్లు జారీ చేసింది. కరూర్ తొక్కిసలాట దుర్ఘటన దర్యాప్తు నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని పేర్కొంది. జనవరి 12న ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి రావాలని నోటీసుల్లో తెలిపింది.

## నేపాల్ సరిహద్దు మూసేసిన భారత్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** హిమాలయ దేశమైన నేపాల్‌లో ఆందోళనలు చెలరేగాయి. భారత సరిహద్దు ప్రాంతాల్లో మతపరమైన ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో భారత్ అప్రమత్తమైంది. నేపాల్‌తో సరిహద్దును మూసేసింది. ఎమర్జెన్సీ సేవలు మినహా సీమాంతర కదలికలపై ఆంక్షలు విధించింది.

## యూపీలో 2.89 కోట్ల ఓటర్ల తొలగింపు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లో 'సర్' ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మొత్తం 2.89 కోట్ల ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ అధికారులు తెలిపారు. ఇందులో 46 లక్షల ఓటర్లు ఇప్పుడు ప్రాణాలతో లేరని గుర్తించారు. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 12.56 కోట్ల ఓటర్లు ఉన్నారు.

# కవితకు కలిసొచ్చేనా?

**రాష్ట్ర రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం కేంద్రబిందువుగా మారారు. సోమవారం శాసనమండలిలో ఆమె ఆవేదనతో చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తన ఉద్యమ, రాజకీయ ప్రస్థానంతో పాటు బీఆర్ ఎస్ పార్టీలో ఎదుర్కొన్న అవమానాలు, పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అదే సమయంలో కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు కవిత చేసిన ప్రకటన కూడా ఆసక్తికర చర్చకు దారి తీసింది. ప్రస్తుతం బీఆర్ ఎస్ బలహీనపడడం, బీజేపీ ఆశించిన మేరకు బలపడకపోవడం కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ శూన్యతను కవిత భర్తీ చేస్తుందా? తెలంగాణలో తమదైన ముద్ర వేస్తుందా? ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న ఆమె కోరిక నెరవేరుతుందా? వంటివెన్నో చర్చనీయాంశంగా మారాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత రాజకీయ ప్రస్థానంపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఆమె స్థాపించనున్న పార్టీ మనుగడపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ బలహీనపడిన తర్వాత ఏర్పడిన రాజకీయ శూన్యతను ఆమె భర్తీ చేస్తుందా? కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఆమె పార్టీ ఎదుగుతుందా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజకీయంగా సొంత తండ్రి, సోదరుడితో విభేదించి, పార్టీ నుంచి గెంటివేతకు గురైన కవిత.. తనదైన ముద్ర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ఆమె.. రాజకీయంగా తన బలం పెంచుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే కొత్త పార్టీ ఏర్పాటుకు ముందుకొచ్చారు. వచ్చే దసరాలోపు ఆమె రాజకీయ పార్టీని ప్రారంభిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

- రాష్ట్రంలో రాజకీయ శూన్యత
- ఓటమి తర్వాత బలహీనపడిన బీఆర్ఎస్
- తెలంగాణలో బలపడలేక పోతున్న బీజేపీ
- కవిత కొత్త పార్టీ ఆ స్థానాన్ని భర్తీ చేసేనా?
- కేసీఆర్ బిడ్డ రాజకీయ భవితవ్యంపై అందరి దృష్టి

### షర్మిలలా కాకుండా..

తెలంగాణలో తనదైన ముద్ర వేసుకోవాలన్న ఆలోచనతో కవిత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. వైఎస్ జగన్ సోదరి చెల్లెలు షర్మిల కూడా గతంలో ఇలాగే కొంతకాలం హడావుడి చేశారు. పార్టీ స్థాపించి నాలుగైదు నెలలు తెలంగాణ వ్యాప్తంగా పర్యటించారు. కానీ, ఆమె పెద్దగా జనాల్ని ఆకట్టుకోలేక చివరకు చేతులెత్తేశారు. సోదరుడిపై కోపంతో షర్మిల లానే కవిత కూడా ఇప్పుడు రాజకీయ పోరాటం ఆరంభించబోతున్నారు. అయితే, షర్మిలలా కాకుండా ప్రణాళికా ప్రకారం ఆమె ముందడుగు వేస్తున్నారు. బీసీలు, యువత, నిరుద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలపై పోరాటం ద్వారా ఆయా వర్గాలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా అంశాలపై పలుమార్లు ధర్నాలు, దీక్షలు చేపట్టిన కవిత రానున్న రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపట్టాలని యోచిస్తున్నారు.

### కదిలించిన ప్రసంగం..

ఎప్పుడైతే తనను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించారో అప్పటి నుంచి కవిత ప్రజల్లోకి బలంగా వెళ్తున్నారు. జాగృతి జనం బాట పేరిట నాలుగు నెలల పాటు తెలంగాణ వ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో వివిధ అంశాలపై ఆమె పోరాటం చేసినా పెద్దగా ప్రాధాన్యం సంతరించుకోలేదు. అయితే, సోమవారం శాసనమండలిలో ఆమె చేసిన భావోద్వేగ ప్రసంగం మాత్రం ప్రజలతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. తన ఉద్యమ నేపథ్యం, బతుకమ్మకు ప్రపంచ గుర్తింపు, ఎంపీగా, ఎమ్మెల్సీగా చేసిన పనులతో పాటు బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిణామాల గురించి వివరిస్తూ ఆమె కన్నీరు పెట్టుకోవడం చాలా మందిని కదిలించింది. ఆమెను ఒంటరి చేశారనే భావనను కలిగించింది.

### ప్రణాళికతో ముందుకెళ్తే..

రాష్ట్రం ప్రస్తుతం రాజకీయ శూన్యత కనిపిస్తోంది. 2023 వరకు ఎంతో బలంగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు పూర్తిగా బలహీనపడింది. అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం కాగా.. కేటీఆర్ ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్నారు. హరీశ్‌రావు పాత్ర పరిమితమే. ఈ నేపథ్యంలో కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. ఇక, మరో ప్రధాన పార్టీ బీజేపీ రాష్ట్రంలో ఎదిగేందుకు ఉన్న అవకాశాలను చేజేతులా జారవిడుచుకుంటోంది. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే కాషాయ పార్టీ ప్రజాభిమానం సంపాదించడంలో విఫలమవుతోంది. ఇక, 2023కు ముందు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దారుణంగా ఉండేది. కేవలం బీఆర్ఎస్ పాలన మీద నెలకొన్న తీవ్ర వ్యతిరేకత, రేవంత్‌రెడ్డి ఒంటరి పోరాటం కారణంగా హస్తం పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతానికి ప్రభుత్వంలో ఉన్నా ఆ పార్టీ చెప్పుకోదగ్గ స్థాయిలో రాష్ట్రంలో ఇంకా బలపడలేదు. ఏ లెక్కన చూసుకున్నా తెలంగాణలో రాజకీయ శూన్యత ఆవరించింది. కవిత పక్కా ప్రణాళికతో ప్రజా సమస్యలపై ఎనలేని పోరాటంతో ముందుకెళ్తే ఆమె సక్సెస్ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆ దిశగా అడుగులు పడుతాయా? అన్నదే అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న.

## త్వరలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ: పొంగులేటి



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గంలో చర్చించి జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకుని, అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతోనే ప్రక్రియ చేపడతామని చెప్పారు. శాసనసభ సభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగిందన్నారు. ఇష్టానుసారంగా విభజన చేశారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే కొత్త మండలాలు, డివిజన్ల ఆవశ్యకతను సైతం గుర్తించామని పొంగులేటి చెప్పారు.

## ఆర్టీసీకి కొత్తగా 2800 ఎలక్ట్రికల్ బస్సులు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీకి త్వరలో కొత్తగా 2800 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా ఆయన మంగళవారం మాట్లాడారు. ఆర్టీసీలో ఇప్పటికే 575 ఈవీ బస్సులు ఉండగా.. మరో 2800 బస్సులు పీఎం ఈ డ్రైవ్ కింద రానున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఈవీ వాహనాల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకురావడంతో అమ్మకాలు బాగా పెరిగాయని చెప్పారు. ప్రభుత్వం సైతం ఈవీ వాహనాలు 25 శాతం నుంచి 50 శాతం వరకు వాహనాలు కొనుగోలు చేయాలనే చర్చ జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 20 శాతం సబ్సిడీ ఇవ్వాలనే అంశం ప్రభుత్వంలో చర్చ కొనసాగుతోందని చెప్పారు.

## కోనసీమకు ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలో ఆందోళనకర పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇరుసుమండ వద్ద ఉన్న ఓఎన్‌జీసీ పైపులైన్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఏర్పడిన బ్లో అవుట్ రెండో రోజు కూడా కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే మంటల తీవ్రత తగ్గిందని అధికారులు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఢిల్లీ నుంచి ప్రత్యేక నిపుణుల బృందం వస్తున్నట్లు ఓఎన్‌జీసీ అధికారులు తెలిపారు.

## ఢిల్లీలో ఎన్‌కౌంటర్.. ఇద్దరు షూటర్లు అరెస్టు

**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు షూటర్లకు గాయాలు కాగా.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు ఇటీవల ఆయా నగర్‌లో జరిగిన భారీ కాల్పుల ఘటనకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్ సమయంలో ఇద్దరు నేరస్థులు కాళ్లకు తూటాలు తగలడంలో గాయపడ్డారు. ఢిల్లీ పోలీసు క్రైమ్ బ్రాంచ్ బృందం ఈ ఆపరేషన్‌ను చేపట్టింది.





## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. కాగా.. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్ సమావేశాల్లో పలు కీలక బిల్లులను తీసుకువచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా వన్ నేషన్ - వన్ ఎలక్షన్ బిల్లుపై చర్చతో పాటు 30 రోజుల పాటు జైల్‌లో ఉన్నట్లయితే సీఎం, మంత్రులను పదవి నుంచి తొలగించే కీలక బిల్లులపై చర్చ జరిగే ఛాన్స్ ఉంది. ఈ రెండు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం పొందితే దేశ రాజకీయాల్లో కీలక మార్పులు జరిగే అవకాశం ఉంది.

## వెనెజువెలా రాజధానిలో ఉద్రిక్తత..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** వెనెజువెలాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని కారకాస్‌లోని అధ్యక్ష భవనం పరిసరాల్లో కాల్పుల శబ్దాలు వినిపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానిక కాలమాన ప్రకారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మొదలైన ఈ ఘటన దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ సమయంలో వరుసగా తూటాల శబ్దాలు వినిపించడమే కాకుండా, ఆకాశంలో డ్రోన్లు, విమానాలు తిరుగుతున్న శబ్దాలు కూడా వినిపించాయని స్థానికులు చెబుతున్నారు. కారకాస్‌లో జరిగిన ఘటనకు అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని వైట్ హౌస్ స్పష్టంచేసింది. అయితే దీనిపై వెనెజువెలా ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## 'టాక్సిక్'లో రుక్మిణి వసంత్.. ఫస్ట్ లుక్ రిలీజ్..



**గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' నుంచి మరో హీరోయిన్ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ మెలిసా అనే పాత్రలో కనిపించనుంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఆమె ఇప్పటివరకు చేసిన సాధారణ పక్కింటి అమ్మాయి పాత్రలకు పూర్తిగా భిన్నంగా, గ్లామర్ అవతారంలో దర్శనమిచ్చింది. థై స్లిట్ ఉన్న నీలం రంగు డ్రస్, ప్రత్యేకమైన హెయిర్ స్టైల్‌తో పార్టీలో పొగమంచు నిండిన వాతావరణం మధ్య నడుస్తున్న ఆమె లుక్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. రుక్మిణి లుక్స్ నెట్టింట వైరల్ గా మారాయి.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**

## కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడి కన్నుమూత



**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడి (81) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన పుణెలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబీకులు తెలిపారు. మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు ప్రభుత్వంలో కల్మాడి రైల్వే సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగానూ కొనసాగారు. ఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడల సందర్భంగా నిర్వాహక కమిటీ చైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 1964 నుంచి 1972 వరకు వాయుసేనలో పైలట్‌గా పనిచేశారు.